

కల్లూరు వాసవి పాఠశాలలో జరిగిన వేడుకల్లో విద్యార్థులు



● స్వీట్లు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యార్థులు



● భైంసాలో నృత్యం చేస్తున్న ఆల్ఫోర్స్ హై స్కూల్ విద్యార్థులు

జోరుగా.. హుషారుగా..!

» జిల్లాలో పలుచోట్ల హోరెత్తిన నూతన సంవత్సర స్వాగత వేడుకలు » పాఠశాలల్లో ముందస్తు వేడుకలు.. నృత్యాలు

భైంసా, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు హోరెత్తాయి. ముఖ్యంగా భైంసా రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణంలో నూతన సంవత్సరం పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం సందడి వాతావరణం నెలకొన్నది. పట్టణంలోని పలు మిఠాయి దుకాణాలు, హోటళ్ళు, బిర్యానీ సెంటర్లు, చికెట్ సెంటర్లు, బేకరీలతోపాటు మద్యం దుకాణాలు జనాలతో కిక్కిరిసిపోయాయి. ముగుసిపోతున్న 2024కు వీడ్కోలు పలుకుతూ 2025 కొత్త సంవత్సరానికి స్వాగతం చెప్పేందుకు యువత, ప్రజలు తమ బంధుమిత్రులతో విందు ఏర్పాట్లు చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం భైంసా పట్టణంలో ఎక్కడ చూసినా జనం తాకిడి కనిపించింది. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని బేకరీ యజమానులు ఆఫర్‌లను కూడా ప్రకటించి కేకులను తక్కువ ధరకే విక్రయించారు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని దుకాణాల్లో పూల బొకేలను తయారుచేసి విక్రయానికి సిద్ధంగా ఉంచారు. ప్రత్యేకంగా రోడ్లపై షామియానాలు ఏర్పాటు చేసి కేకులు, బొకేలను పెద్దసంఖ్యలో విక్రయించారు.

● హోరెత్తిన స్వాగత వేడుకలు

నూతన సంవత్సరానికి స్వాగతం సంబరాలు భైంసాలో మంగళవారం సాయంత్రం నుంచే ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగానే భైంసాలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహించిన వేడుకలు ఆద్యాంతం జోరుగా..హుషారుగా కొనసాగాయి. ప్రధానంగా రాహుల్‌నగర్ కాలనీ పరిధిలోని ఆల్ఫోర్స్ హైస్కూల్‌లో చేపట్టిన నూతన సంవత్సర స్వాగత కార్యక్రమాలు హోరెత్తాయి, పాఠశాల విద్యార్థులు పాతసంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా అలరారించాయి.

● పాఠశాలల్లో ముందస్తు వేడుకలు

నిర్మల్‌రూరల్: పట్టణంలోని దీక్ష జూనియర్ కళాశాలలో ముందస్తు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు కేక్ కట్‌చేసి, ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ వెంకటరెడ్డి, కరస్పాండెంట్ ప్రమోద్ రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూరు వాసవి ప్లే స్కూల్‌లో మంగళవారం ముందస్తు ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఆనందోత్సహాలతో పాల్గొని సంబరాలు జరుపుకున్నారు. కేక్‌కట్‌చేసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

3న ఆదిలాబాద్‌కు ఏకసభ్య కమిషన్ రాక

నిర్మల్‌కల్చరల్, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఏకసభ్య విచారణ కమిషన్ సభ్యుడు డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ ఆదిలాబాద్‌కు రానున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కొమురం భీమ్ జిల్లాకు చెందిన వారితో వివరణాత్మక అధ్యయనం చేస్తారని తెలిపారు. ఆదిలాబాద్ కలెక్టర్ సమావేశ మందిరంలో ఉదయం 11 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అభిప్రాయాలు, వినతులు స్వీకరిస్తారని తెలిపారు. అన్ని ఎస్సీ కుల సంఘాల ప్రతినిధులు, ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని తమ అభిప్రాయాలు వెల్లడించాలని సూచించారు.

విజయ హైస్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన

నిర్మల్‌అర్బన్, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): నిర్మల్‌లోని విజయ హైస్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్‌రూల్స్‌పై నిర్మల్ జిల్లా అడిషనల్ ఎస్పీ ఉపేందర్‌రెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్‌రూల్స్‌ను తప్పకుండా పాటించాలని, హెల్మెట్ ధరించాలని తెలిపారు. ట్రాఫిక్‌రూల్స్ పాటించకుండా డ్రైవింగ్ చేసేవారు ప్రమాదాలకు ఎలా గురి అవుతున్నారో వివరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడిపించవద్దని తెలిపారు. కార్యక్రమంలో విద్యాలయం సెక్రటరీ అయ్యన్నగారి భూమయ్య మాట్లాడుతూ ఏఎస్పీ చెప్పినటువంటి ట్రాఫిక్ రూల్స్ అందరూ పాటించాలని, పాటించకుండా ఉండడంతో జరిగే ప్రమాదాల గురించి వివరించారు. కార్యక్రమంలో విద్యాలయం కరస్పాండెంట్ మంచిర్యాల నాగభూషణం, ట్రెజరర్ ఆడెపు సుధాకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కేజీబీవీలను సందర్శించిన సమన్వయ అధికారులు

నిర్మల్‌కల్చరల్, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు కేజీబీవీ పాఠశాలలను మంగళవారం విద్యాశాఖ సమన్వయ అధికారుల బృందం సందర్శించింది. దస్తురాబాద్, పెంబి, లక్ష్మణచాంద పాఠశాలలను సందర్శించారు. మధ్యాహ్న భోజన, విద్యాబోధన, ఆరోగ్యం తదితర అంశాలను విద్యార్థులతో చర్చించారు. సమన్వయకర్త పద్మ, సలోమి కరుణ పాఠశాలలను తనిఖీ చేశారు.

హరిహరక్షేత్రానికి పోటెత్తిన భక్తులు

నిర్మల్‌అర్బన్, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని అయ్యప్ప హరిహర క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం సుబ్రహ్మణ్య స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించిన అనంతరం ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తలు అల్లోల మురళీధర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



హారతి తీసుకుంటున్న భక్తులు

నిర్మల్ ఉత్సవాలను విజయవంతం చేయాలి

● కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌కల్చరల్, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ ఉత్సవాలకు ఘనంగా నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్మల్ ఉత్సవాల కార్యక్రమం ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్‌లతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'నిర్మల్ ఉత్సవాలు' పేరిట జనవరి 6నుంచి 8వ తేదీ వరకు పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 11గంటల నుంచి రాత్రి 9గంటల వరకు సందర్శకులకు అనుమతి ఉంటుందని తెలిపారు. సాయంత్రం వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, అధికారులకు కేటాయించిన బాధ్యతలను పకడ్బందీగా నిర్వహించి నిర్మల్ ఉత్సవాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. నిర్మల్ ఉత్సవాల్లో భాగంగా నిర్మల్‌చరిత్ర తెలిసేలా వివిధశాఖల నుంచి స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. మహిళాస్వయం సంఘాల ఉత్పత్తులు, వ్యవసాయ, కొయ్య బొమ్మలు, పెయింటింగ్స్, హస్తకళలు, పుస్తకాలు, దుస్తులు, తినుబండారాల స్టాళ్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. నిర్మల్ ఉత్సవాల కార్యక్రమంపై హోర్డింగ్‌లు, కరపత్రాల ద్వారా ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. జిల్లాకు చెందిన ప్రముఖ వ్యక్తులను గుర్తించి వారిని కార్యక్రమంలో భాగస్వాములు చేయాలని తెలిపారు. నిర్మల్ జిల్లా చరిత్రను తెలిపే విధంగా పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజలను ఆకట్టుకునే విధంగా అందమైన విద్యుత్ దీపాలతో ముస్తాబు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పార్కింగ్ ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని, అగ్నిమాపక, అత్యవసర వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. ఆసక్తి కలిగిన ప్రజలు ఎవరైనా తమ ఉత్పత్తుల స్టాళ్లను ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేయాలనుకుంటే సంబంధిత వెబ్‌సైట్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాల కోసం 9849 913071 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు. సమావేశంలో ప్రణాళిక అధికారి జీవరత్నం, డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, డీఈవో పి. రామారావు, డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ గోపాల్, డీఎంహెచ్‌వో రాజేందర్, డీఎస్‌వో కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, డీపీఆర్‌వో విష్ణువర్ధన్, మెప్మా పీడీ సుభాష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

ఆలయాల్లో చోరీ ఘటనలను నిరసిస్తూ నేడు భైంసా బంద్

భైంసా, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): భైంసా డివిజన్ పరిధిలోని ఆలయాల్లో చోటు చేసుకుంటున్న వరుస చోరీ ఘటనలను నిరసిస్తూ బుధవారం భైంసా బంద్‌కు పిలుపునిచ్చినట్లు హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి వెల్లడించింది. ఈ మేరకు మంగళవారం రాత్రిభైంసాలోని నర్సింహ కల్యాణ మండపంలో హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. మంగళవారం నాగదేవత ఆలయంతో పాటు ఇటీవల భైంసా పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం, నర్సింహస్వామి ఆలయం, పంచముఖి హనుమాన్ ఆలయంతో పాటు డివిజన్ పరిధిలోని వానల్‌పాడ్, పార్డీ (బి) గ్రామాల్లో పలు ఆలయాల్లో చోటు చేసుకుంటున్న వరుస చోరీ ఘటనలను దేవాలయాల పరిరక్షణ సమితి సభ్యులు తీవ్రంగా చర్చించారు. దేవాలయాల్లో వరుస చోరీ చోరి ఘటనలు చోటు చేసుకుంటున్నా.. వాటి నివారణకు అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టడం లేదని సమితి ప్రతినిధులు సమావేశంలో పేర్కొన్నారు. సంబంధిత ఘటనలను నిరసిస్తూ, చోరీలకు పాల్పడుతున్న దొంగలను వెంటనే పట్టుకోవాలనే డిమాండ్‌తో బుధవారం బంద్‌కు పిలుపునిచ్చినట్లుగా హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి వెల్లడించింది. బంద్‌కు అన్ని వర్గాలు సహకరించాలని సమితి ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

జిల్లాలో 30 యాక్ట్ అమలు : ఎస్పీ

నిర్మల్ కల్చరల్, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జనవరి 1 నుంచి 31 వరకు 30 యాక్ట్ 1861 అమలు చేస్తున్నట్టు ఎస్పీ జానకీషర్మిల మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసు ఉన్నత అధికారుల అనుమతి లేకుండా బహిరంగ సభలు, ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించొద్దని పేర్కొన్నారు. నిషేధిత ఆయుధాలు, తుపాకులు, ప్రేలుడు పదార్థాలు, నేరాలను ఉసిగొలిపే ఆయుధాలు వాడరాదని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగేలా ప్రవర్తించవద్దని తెలిపారు.

నాగదేవత ఆలయంలో ఎలాంటి నష్టం జరుగలేదు.. అసత్య ప్రచారాలు నమ్మొద్దు

భైంసాలోని నాగదేవత ఆలయంలో మంగళవారం తెల్లవారు జామున కొందరు గుర్తుతెలియని వ్యక్తులు హుండీ పెకిలించే సమయంలో అక్కడి టైల్స్ పగిలిపోయాయే తప్ప ఎలాంటి నష్టం జరుగలేదని ఎస్పీ జానకీషర్మిల ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు జరుగుతున్నాయని, వాటిని నమ్మవద్దని ప్రజలను ఈ సందర్భంగా కోరారు.



సోషల్ పోలీసింగ్!



● ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల (ఫైల్)

» గతేడు పెరిగిన నేరాల శాతం » 16 మర్డర్లు, 39 రేప్ కేసులు

» పెరిగిన సైబర్ క్రైం » యూబిట్ కాయిన్ దందాపై జిల్లా పోలీసుల ఉక్కుపాదం » జిల్లా అంతటా యాంటీ డ్రగ్ ఆపరేషన్

ట్రిపుల్ ఐటీని దత్తత తీసుకున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): 2024 సంవత్సరంలో పోలీస్ యంత్రాంగం ఇటు నేరాలను తగ్గించే దిశగా చర్యలు తీసుకుంటూ.. మరోవైపు శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తూ దీనికి అదనంగా విస్తృత స్థాయిలో సామాజిక కార్యక్రమాలు చేపట్టి సోషల్ పోలీసింగ్‌కు బాటలు వేసింది. జిల్లా ఎస్పీ జానకీ షర్మిల తనదైన శైలిలో పోలీసు శాఖపై ప్రత్యేక ముద్ర వేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అంతర్జాతీయ స్థాయిలో.. అక్రమ పద్ధతిలో కొనసాగిన యూబిట్ కాయిన్ క్రిప్టో కరెన్సీ దందాపై ఉక్కుపాదం మోపి పోలీసు మార్క్ వేశారు. అలాగే వేగంగా పెరిగిన సైబర్‌క్రైంను నిరోధించేందుకు కఠిన చర్యలు చేపడుతూనే ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు కల్పించారు. దీంతో పాటు మత్తు పదార్థాల నిరోధానికి ఆమె యాంటీ డ్రగ్ ఆపరేషన్‌ను ప్రారంభించారు. ఇదిలా ఉండగా 2024 సంవత్సరంలో నేరాలు, దొంగతనాలు, హత్యలు, హత్యాచారాల కేసులు పెరిగాయి. జిల్లాలో గత సంవత్సరం మొత్తం 3524 కేసులు నమోదు కాగా.. ఇందులో నిర్మల్ పట్టణంలోనే 599 కేసులు నమోదయ్యాయి. అయితే అత్యల్పంగా 75 కేసులు పెంబి పోలీస్ స్టేషన్‌లో నమోదయ్యాయి. 49 సైబర్ క్రైం కేసులు, 1,47,368 ఈ చలాన్ కేసులు, 390 రోడ్డు ప్రమాదాల కేసులు నమోదు కావడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఇలా జిల్లాలో ఓ వైపు నేరాల కేసులు ఎక్కువగా నమోదైనప్పటికి పోలీసులు వాటి నిరోధానికి కృషి చేస్తూనే మరోవైపు ఫ్రెండ్లీ, సోషల్ పోలీసింగ్ విధానాన్ని అమలు చేస్తుండడం ప్రత్యేకతగా చెప్పొచ్చు.

జిల్లాలో పెరిగిన నేరాల సంఖ్య

జిల్లాలో గత సంవత్సరం మొత్తం కేసులు 3,524 నమోదు కాగా.. ఇందులో 16 హత్య కేసులు, 166 దొంగతనాల కేసులు, ఐపీసీ 307 కేసులు 39, దోపీడీలు 10, రేప్ కేసులు 39 , కిడ్నాపింగ్ కేసులు 39 ఉన్నాయి. దీనికి తోడు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు 40 వరకు నమోదైనట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. కాగా డ్రంకన్ డ్రైవ్ కేసులు 3,606, ఓపెన్ డ్రింకింగ్ కేసులు 1,059, ఈచలాన్ కేసులు 1,47,368 కేసులు రోడ్డు యాక్సిడెంట్ కేసులు 399 నమోదయ్యాయి. కాగా ఈ రోడ్డు ప్రమాదాల్లో 133 మంది మరణించగా, 412 మంది గాయాలపాలయ్యారు. ఇదిలాఉండగా 16 మందిపై రౌడీ షీట్లను, ఇద్దరిపై డాసీయర్ క్రిమినల్ సీట్‌లను ఓపెన్ చేశారు. కాగా 49 కేసులు నమోదయ్యాయి. సీఈఐఆర్ విధానంతో వెయ్యికి పైగా సెల్‌ఫోన్‌లను బాధితులకు తిరిగి ఇప్పించగలిగారు. మొత్తానికి ఈసారి క్రైం రేట్ పెరగడం గమనార్హం.

యూబిట్ కాయిన్ కలకలం

జిల్లాలో భారీఎత్తున జరిగిన యూబిట్ కాయిన్ క్రిప్టో కరెన్సీ అక్రమ దందాపై పోలీసులు ఉక్కుపాదం మోపడం గతేడాది ప్రత్యేకతగా చెబుతున్నారు. జిల్లా ఎస్పీ జానకీషర్మిల యూబిట్ కాయిన్ అక్రమ దందా సూత్రదారులను అనూహ్యంగా అరెస్టుచేయడమే కాకుండా వారిని కటకటాలకు పంపారు. వేలాదిమంది ఈ దందాలో పెట్టుబడులు పెట్టి మోసపోకుండా ఎస్పీ అడ్డుకోగలిగారు. రాష్ట్రస్థాయిలోనే ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. పోలీసుశాఖకు ఈకేసు ప్రతిష్ఠాత్మకమైంది. అలాగే డ్రగ్స్ కంట్రోల్ కోసం పోలీసులు అమలుచేసిన యాంటీడ్రగ్ ఆపరేషన్ కూడా సత్ఫలితానిచ్చింది. గంజాయి, ఇతర మత్తుపదార్థాలను పెద్దమొత్తంలో పట్టుకోవడమే కాకుండా వీటికి బానిసలైన వారికి సైతం పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. అలాగే గంజాయి సాగుచేస్తున్న పంటపొలాల్లో పోలీసులు మెరుపుదాడులు నిర్వహించారు. దిలావర్‌పూర్ మండలంలోని 'ఇథనాల్ ఫ్యాక్టరీ' అంశంలోనూ పోలీసులు సమన్వయంతో వ్యవహరించారు.



ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిలకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఉద్యమకారులు (ఫైల్)

సోషల్ రెస్పాన్స్‌బులిటీకి అత్యధిక ప్రాధాన్యం

గతేడు పోలీసుశాఖ వైపు నేరాలను అదుపు చేయడం, శాంతి భద్రతలను కాపాడడమే లక్ష్యంగా పెట్టుకుంటూ సోషల్ రెస్పాన్స్‌బులిటీని పూర్తిస్థాయిలో అమలుచేసింది. ముఖ్యంగా ఎస్పీ జానకీషర్మిల ఆధ్వర్యంలో బాసర ట్రిపుల్‌ఐటీని దత్తత తీసుకోవడం ప్రాధాన్యతకు కారణమైంది. బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలను అరికట్టే కార్యక్రమంతోపాటు విద్యార్థుల్లో మానసికస్థైర్యాన్ని నింపేప్రయత్నం చేశారు. అలాగేవారికి సమస్యల పరిష్కారానికి కూడా ఎస్పీ పరిష్కారం చూపారు. దీంతో పాటు బాసర గోదావరిపై పెరుగుతున్న ఆత్మహత్యలను నిరోధించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. బ్రిడ్జికి ఇరువైపులా ఇనుపకంచెలను ఏర్పాటుచేయడం, పోలీస్ పెట్రోలింగ్ కొనసాగించడం, బ్రిడ్జిపై సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం లాంటి చర్యలను చేపడుతున్నారు. జిల్లావ్యాప్తంగా సోషల్ కాంట్రాక్ట్ ప్రోగ్రాంలను విస్తృతంగా నిర్వహించారు. భరోసా సెంటర్ ద్వారా విడిపోయిన 20 కుటుంబాలను ఏకం చేసి ప్రశంసలు అందుకున్నారు. ఇలా పోలీసు శాఖ గతేడాది తనదైన శైలిలో జిల్లాపై చెరగని ముద్ర వేసింది.


రైతులు సంఘటితంగా, ఆత్మవిశ్వాసంతో ఉండాలి

● న్యాయసేవా సాధికార సంస్థ జిల్లా న్యాయాధికారి రాధిక

దిలావర్‌పూర్, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): రైతులు సంఘటితంగా, ఆత్మవిశ్వాసంతో ఉండాలని న్యాయసేవా సాధికార సంస్థ జిల్లా న్యాయాధికారి రాధిక అన్నారు. రైతు కష్టం దళారుల పాలవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మండలకేంద్రంలో మంగళవారం చట్టాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయసేవా సాధికార సంస్థ జిల్లా న్యాయాధికారి రాధిక మాట్లాడుతూ రైతుల్లో ఉన్న ఐక్యత లోపం వల్లే దళారీ వ్యవస్థ బలపడుతోందన్నారు. రైతు కష్టాన్ని దళారులు కొట్టేసి దర్జాగా తిరుగుతుంటే.. రెక్కలుముక్కలు చేసుకున్న రైతు రోడ్డున పడుతున్నాడని అన్నారు. అయితే రైతులకు ఉపయోగపడే అనేక చట్టాలు రాజ్యాంగంలో ఉన్నాయని, వాటిపై అవగాహన లేక రైతులు నష్టపోతున్నారని చెప్పారు. ముందుగా రైతులు సంఘటితంగా ఉండి దళారీ వ్యవస్థను తిప్పి కొట్టాలన్నారు. చట్టాలు ఎక్కడి నుంచి రావని ప్రజల డిమాండ్ నుంచే చట్టాలు పుట్టుకొస్తాయన్నారు. అయితే మనంచేసే డిమాండ్ నలుగురికి ఉపయోగపడేదిగా ఉండాలన్నారు. సమాజంలో ప్రతీ ఉద్యోగం ఒత్తిడితోనే కూడుకున్నదని, కానీ వ్యవసాయంలో రైతేరాజు అని ఎలాంటి ఒత్తిడిలేని వృత్తి వ్యవసాయమేనని చెప్పారు. ఎంతోమంది ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తూ ఒత్తిడి భరించలేక ఇంటికొచ్చి వ్యవసాయం చేస్తున్నారని చెప్పారు. రైతులు ఎప్పుడూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవద్దని సూచించారు. మన పిల్లలకు చదువుతోపాటు వ్యవసాయంపై కూడా అవగాహన కల్పించాలన్నారు. బావులను తహసీల్దార్‌కు దరఖాస్తు పెట్టుకుని రెగ్యులరైజ్ చేసుకోవాలని సూచించారు. సమాజంలో పేదలు లాయర్‌ను పెట్టుకునే ఆర్థిక స్థోమత లేనివారికి న్యాయ సేవ సాధికార సంస్థ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ రెడ్డి, ఎస్సై సందీప్, ఏఈవో తేజస్విని, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగాన్ని బాధ్యతగా నిర్వర్తించాలి

ఉద్యోగాన్ని బాధ్యతగా నిర్వర్తించాలని న్యాయసేవా సాధికార సంస్థ జిల్లా న్యాయాధికారి రాధిక కేజీబీవీ సిబ్బందికి హితవు పలికారు. మంగళవారం న్యాయాధికారి ఆకస్మికంగా కేజీబీవీని సందర్శించారు. నేరుగా తరగతి గదిలోకి వెళ్లిన విద్యార్థులతో మాట్లాడారు. నాణ్యమైన భోజనం పెడుతున్నారా అని పిల్లలను ప్రశ్నించారు. పిల్లలు మౌనం వహించడాన్ని అర్థం చేసుకున్న ఆమె ఇన్‌చార్జి ఎస్‌వోతోపాటు బోధన, బోధనేతర సిబ్బందిని పిలిచి మందలించారు. ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోందని, నాణ్యమైన భోజనం పెట్టడంలో ఇబ్బంది ఏముందని ప్రశ్నించారు. కిచెన్‌లోని బియ్యం, కూరగాయలను పరిశీలించారు. అనంతరం కేజీబీవీ బోధన, బోధనేత సిబ్బందికి పలు సూచనలు చేశారు. మరోమారు నేను వస్తానని, ఆలోపు మార్పు రావాలని ఆదేశించారు.



పిల్లలతో మాట్లాడుతున్న న్యాయాధికారి రాధిక

భైంసా నాగదేవత ఆలయంలో చోరీ

● హుండీ పగులకొట్టి కానుకల అపహరణ ● ఆధారాలు సేకరించిన క్లూస్ టీమ్ ● త్వరలోనే దొంగలను పట్టుకుంటాం: భైంసా ఏఎస్పీ

భైంసా, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణ పరిధిలోని బోకర్ రోడ్డు మార్గంలో గల నాగదేవత ఆలయంలో చోరీ జరిగింది. మంగళవారం వేకువ జాము 4 గంటల ప్రాంతంలో రోజువారీ పోలీసు గస్తీ బృందం ఆలయ పరిసర ప్రాంతంలో పహారా పూర్తి చేసుకొని వెళ్లిన తర్వాత చోరీ ఘటన చోటుచేసుకున్నట్లుగా తెలిసింది. గుర్తు తెలియని దొంగలు ఆలయ పరిసర ప్రాంతంలోని పెద్ద రాయి ద్వారా ప్రవేశ మార్గానికి వేసిన తాళాన్ని పగులకొట్టి లోనికి ప్రవేశించారు. అదే రాయి ద్వారా ఆలయంలోని హుండీని పగులకొట్టి భక్తులు సమర్పించిన అందులోని కానుకలను అపహరించుకపోయారు. ఈ క్రమంలో హుండీ స్థలిలోని ఫ్లోరింగ్‌తో పాటు అక్కడి పిల్లర్‌కు అమర్చిన టైల్స్ పగిలిపోయాయి. చోరీకి పాల్పడ్డ దొంగలు ఆలయంలోని విగ్రహాల వద్ద పూజ సామాగ్రిని చిందరవందరగా చేశారు.ఉదయం 9 గంటల ప్రాంతంలో దుస్సంఘటన వెలుగు చూడగా సంబంధిత సమాచారం అందుకున్న టౌన్ సీఐ గోపినాథ్ ఘటన స్థలికి వెళ్లి పరిశీలనలు చేపట్టారు. పోలీసు క్లూస్ టీం ఆలయంలో ఆధారాలను సేకరించగా జాగిలం ఘటన స్థలి నుంచి పాంగ్రి గ్రామ రోడ్డు వైపు వరకు వెళ్లి వచ్చింది. నాగదేవత ఆలయంలో చోటు చేసుకున్న ఘటనపై సమాచారం అందుకున్న హిందూవాహిని ప్రతినిధి చింతపండు మహేష్, బీజేపీ ప్రతినిధి సుష్మారెడ్డి, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు పెండెపు కాశీనాథ్‌లు తమ తమ శ్రేణులతో ఘటన స్థలికి వెళ్లి ఆందోళనలు చేపట్టారు. ఆలయాల్లో వరుస చోరీ ఘటనలు చోటు చేసుకుంటున్న నివారించే చర్యలు సక్రమంగా చేపట్టడం లేదని అవేదన వ్యక్తం చేశారు. ఇదే సందర్భంలో టౌన్ సీఐ గోపినాథ్ ఆలయంలో దెబ్బతిన్న ఫ్లోరింగ్, ఇతర వాటికి మరమ్మత్తు చర్యలు నిర్వహించే పనులకు పురమాయించగా హిందూవాహిని, హిందూ ఉత్సవ సమితి శ్రేణులు నిలువరించాయి. దొంగలను పట్టుకునేంత వరకు ఆలయంలో ఎలాంటి మరమ్మతులు చేపట్టరాదని వెల్లడించారు. దీంతో మరమ్మత్తు పనులను నిలిపివేయించిన టౌన్ సీఐ గోపినాథ్ త్వరలోనే దుండగులను పట్టుకుంటామని వెల్లడించారు. నాగదేవత ఆలయ నిర్వాహక ప్రతినిధి ఆకుల బోజారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లుగా పేర్కొన్నారు. దుండగులను గుర్తించి పట్టుకునేందుకు రెండు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



ఆలయాన్ని పరిశీలిస్తున్న భైంసా టౌన్ సీఐ గోపినాథ్

● చోరీ ఘటనపై దుష్ప్రచారానికి పాల్పడిన వారిపై చర్యలు

నాగదేవత ఆలయం చోరి ఘటనను ఛేదించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాం. క్లూస్ టీం సేకరించిన ఆధారాల మేరకు ఇద్దరు అనుమానితులను గుర్తించాం. త్వరలోనే ఘటనకు పాల్పడిన దొంగలను పట్టుకుంటాం. అయితే సంబంధిత ఘటనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. భైంసా సున్నిత ప్రాంతమైన దృష్ట్యా శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒకరూ బాధ్యతగా భావించి పోలీసు శాఖకు సహకరించాలన్నారు. వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

(- అవినాష్ కుమార్, ఏఎస్పీ, భైంసా)

వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

కుభీర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని వీవోఏ జేఏసీ జిల్లా నిర్మల్ అధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం కుభీర్‌లో నిర్వహించిన సమావేశంలోఆయన మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వీవోఏలకు కనీస జీతం రూ. 26వేలు ఇవ్వాలని, గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ముత్యం గంగాధర్, వీవోఏల అధ్యక్షులు సాయినాథ్, సుజాత, జీవన్, రాజన్న, అన్ని గ్రామాల వీవోఏలున్నారు.

ఏబీసీడీ వర్గీకరణను ప్రభుత్వం అమలు చేయాలి



మండల కేంద్రంలో డప్పులతో ఊరేగింపు నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తలమడుగు , డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఇచ్చిన ఏబీసీడీ వర్గీకరణ తీర్పును అందరూ గౌరవించి స్వాగతించాల్సిందేనని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్ అన్నారు. తలమడుగు మండల కేంద్రంలోని మండల విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల పోరాటానికి మాదిగ మాదిగ ఉప కులాలు ఎప్పుడు తోడుగా ఉంటారని అన్నారు. ఇన్నాళ్లు మాదిగ మాదిగ ఉపకులాలను దోచుకున్నది చాలంటూ సుప్రీంకోర్టు ఏడుగురి ధర్మసనం వర్గీకరణ రాష్ట్రాలు అమలు పంచుకోవాలని తీర్పు ఇవ్వడం జరిగింది. ప్రభుత్వం కూడా వెంటనే అమలుపరచాలని లేనియెడల వర్గీకరణను అడ్డుకోవడానికి చూస్తున్న వాళ్లపై ప్రభుత్వానికి ఫిబ్రవరి మూడో తేదీన హైదరాబాద్‌లో లక్ష డప్పులు వేల గొంతుల ప్రదర్శన చేపడతామని అమలు చేస్తే సంబరాల ప్రదర్శన చేయకపోతే చావు డప్పు ప్రదర్శన చేస్తామని హెచ్చరించారు. అనం తరం మండల నూతన కార్యవర్గం ఎన్నిక అధ్యక్షులుగా ప్రేమేందర్ మాదిగ, ఉపాధ్యక్షులు మహేందర్, నగేష్, అరవింద్ మాదిగలు, ప్రధాన కార్యదర్శి శివకుమార్ మాదిగ, కోశాధికారి శివకృష్ణ మాదిగ, ప్రచార కార్యదర్శి గంగన్న మాదిగ, సోషల్ మీడియా అరవింద్ మాదిగ, కమిటీని కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్, సీనియర్ నాయకులు అడ్వకేట్ సుదీర్, గంగాధర్, గంగన్న, శివన్న, శివకుమార్, సూర్యకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని భర్తీ చేయాలి

కుభీర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : కుభీర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని వెంటనే భర్తీ చేయాలని కోరుతూ దళిత సంఘ నాయకులు కొత్తూరి శంకర్ చేస్తున్న దీక్ష మంగళవారం రెండవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీచైర్మన్ పదవి దళిత రిజర్వేషన్ రావడం మూలంగా భర్తి చేయడం లేదని, వెంటనే మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ప్రకటించక పోతే పెద్దఎత్తున రాస్తారోకోలు , ధర్నాలు నిర్వహిస్తామని, ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తామన్నారు. ఈ ధర్నాకు సంఘీభావంగా పార్డి(బి) గ్రామస్తులు ధర్నాలో పాల్గొన్నారు.

వందశాతం సర్వే పూర్తి చేయండి

తానూర్ , డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వందశాతం పూర్తి చేయాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ అన్నారు. మండలంలోని భోసి గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శికి పలు సూచనలు అందజేశారు. ఈయన వెంట సిబ్బంది ఉన్నారు.

మాదిగలు ఐక్యంగా ఉంటూ ఉద్యమించాలి

తాంసి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3న తలపెట్టిన లక్ష డప్పులు - వేల గొంతులు కార్యక్రమంలో భాగంగా మంగళవారం తాంసి మండల కేంద్రంలో నిర్వహించిన సన్నాహక సదస్సు కుమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిశీలకులకు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్ మాదిగ, జిల్లా అధ్యక్షులు శ్రీ అరెల్లి మల్లేష్ మాదిగ పాల్గొని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో తాంసి, వడ్డాడి, జామాడి, కప్పర్ల, సవర్గావ్, పాలోది, గుబిడిపల్లె, హస్నాపూర్,యువకులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీకి పాల్పడిన వారిని శిక్షించాలి

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్

భైంసా, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా శివారు ప్రాంతంలోని నాగదేవత ఆలయంలో చోరీకి పాల్పడిన వారిని పట్టుకొని కఠినంగా శిక్షించాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సంబంధిత ఘటనపై మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. హిందూ దేవాలయాల్లో ఇలాంటి చోరీ ఘటనలకు చోటు చేసుకోవడం విచారకరమన్నారు. నాగదేవత ఆలయంలో చోటు చేసుకున్న ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టాలన్నారు. చోరీకి పాల్పడిన వారిని గుర్తించి పట్టుకొని కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇదే క్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా మరోమారు ఆలయాల్లో చోరి ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు గాను పోలీసు శాఖ పకడ్బందీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ఎస్పీ జానకీ షర్మిలతో నాగదేవత ఆలయ చోరీ ఘటనపై మాట్లాడి దొంగలను సత్వరమే పట్టుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లుగా వెల్లడించారు.

జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

● మాజీ మంత్రి జోగురామన్న

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర 2025 క్యాలెండర్‌ను మాజీ మంత్రి జోగురామన్న తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు మాజీ మంత్రి ఇంగ్లీష్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరు న్యూ ఈయర్ వేడుకలను ఆనందంగా జరుపుకుంటు 2025 ప్రతీఒక్కరికి మంచి జరగాలని కోరుతున్నామన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి అపశృతికి తావివ్వకుండా ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

'ఆదివాసీలను పట్టించుకోని బీజేపీ, బీఆర్ఎస్'

బోథ్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): గతంలో బిఆర్ఎస్, బిజెపి పార్టీలు ఆదివాసీలను పట్టించుకోకపోవడం రాష్ట్ర మంత్రి సీతక్క పైన ఉన్న నమ్మకంతో పాటు కాంగ్రెస్ పార్టీ పాలన పట్ల ఆకర్షితులై మండలంలోని ఆదివాసి గ్రామాల నాయకులు పటేన్లు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ పేర్కొన్నారు మంగళవారం మండలంలోని పిప్పలదరి, కొత్తపల్లి, రేండ్లపల్లి, కేశవ్ కూడా, జైతుగూడ గ్రామాల పటేల్ కాంగ్రెస్‌లో చేరడంతో వారికి పార్టీ కండువా కప్పి సాధారణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇంచార్జి మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి సీతక్క ఆదివాసి గూడ ప్రజల కష్ట సుఖాలను పరిశీలించి వారికి అండగా నిలుస్తుంది అన్నారు. రా బాబు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఆదివాసి గ్రామాల ప్రజలు కృషి చేయాలని కోరారు కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అధికార ప్రతినిధిపి చంటి మాజీ ఎంపీటీసీలు కే మహేందర్ నాయకులు యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి బజారత్నం మండలం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కానీ దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతను బట్టి పత్తి ధర చెల్లించాలి

● రైతు స్వరాజ వేదిక డిమాండ్

బోథ్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పత్తి పంట కొనుగోళ్లలో మొదటి నుండి సీసీఐ అధికారులు కొర్రీలు పెడుతూ రైతులను నష్టపరుస్తున్నారని జిల్లా రైతు స్వరాజ్య అధ్యక్షులు వేదిక సంగేపు బోర్రన్న పేర్కొన్నారు మంగళవారం బూతులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 4, 22, 000 వేల ఎకరాల పత్తి పంట సాగు చేస్తున్నారని అయితే రైతులు పండించిన పత్తి కొనుగోలుకు మొదట తేమ పేరుతో రైతులకు గిట్టుబాటు ధర కల్పించలేదన్నారు. మొదట్లో ధరలో కోత పెట్టి రైతులకు నష్టం చేసిన అధికారులు పత్తి పంట చివరి దశకు వస్తుండగా నాణ్యత లేదంటూ 50 రూపాయల నుండి 100 రూపాయల వరకు ధర తగ్గించడంలో అంతర్యం ఏమిటని విమర్శించారు. పత్తి నాణ్యతను బట్టి ధర చెల్లించాలని అన్ని రకాల పత్తికి ఒకే విధమైన ధరను నిర్ణయించడం సరైన పద్ధతి కాదన్నారు నాణ్యత ఉంటే గతంలో చెల్లించిన ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో రైతులు రవి, సుభాష్, బాలాజీ, సుధాకర్, గోపి, దస్ సింగ్ పాల్గొన్నారు.

నేటి నుంచి 31 వరకు జిల్లాలో ఆపరేషన్ స్మైల్: ఏఎస్పీ

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలో జనవరి 1 నుంచి 31 వరకు ఆప రే షన్ స్మైల్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా తప్పిపోయిన పిల్ల లను గుర్తించడం, బాలకార్మికుల సమస్యలు పరిష్కరించడం, అక్రమ రవాణాకు గురైన చిన్నారులను రక్షించడం జరుగుతుందన్నారు. వారికి పునరావాసం, చట్టపరమైన హక్కులు రక్షణ కల్పించనున్నట్టు తెలిపారు. పోలీసు విభాగాలు, ఇతర శాఖలతో కలిసి బృందాలు ఏర్పాటు చేస్తామన్నారు. రైల్వే, బస్ స్టేషన్లు, ఫ్యాక్టరీలు, వాణిజ్య సంస్థలు సందర్శించి పిల్లలను రక్షించే చర్యలు తీసుకుంటామని తెలి పారు. పిల్లలను రక్షించడంతో సమాజంలో వారికి మంచి భవిష్యత్, మార్పు తీసుకురావచ్చునని వివ రించారు. ఇందుకోసం పోలీసు శాఖ కృషి చేస్తోందన్నారు. చైల్డ్ 1098, చైల్డ్‌వెల్ఫేర్, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పిల్లలకు తక్షణ సహాయం అందిస్తామని పేర్కొన్నారు. కార్మికశాఖ అధికారి రాజలింగం, సీడబ్ల్యూసీ చైర్మన్ ఎండీ వహీద్, సీడీపీవో నాగలక్ష్మి, ఎస్సైలు ప్రదీప్, నరేష్, సుమాంజలి (షీ టీం), తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి విరాళం

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రామాయి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం కోసం సామాజిక కార్యకర్త ముడపు మౌనిష్ రెడ్డి మంగళవారం రూ.31 వేలు అందజేశారు. ఈ సంద ర్భంగా కమిటీ సభ్యులు మౌనిష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన పెయింటింగ్ తరగతులు

ముథోల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ముథోల్‌లో రబింద్ర ఉన్నత పాఠశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న చేర్యాల్ పెయింటింగ్ శిక్షణ తరగతులు విజయవంతంగా మంగళవారం ముగిశాయి. చేర్యాల్ పెయింటింగ్ శిక్షకులు ధనాలకోట నాగేశ్వర్ సమక్షంలో ఈ శిక్షణ తరగతులు చేపట్టారు. ఈ తరగతులను స్పిక్ మాకే సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ విజయోత్సవ సభకు చేర్యాల్ ఆర్టిస్ట్ సాయికిరణ్, స్పిక్ మాకే సంస్థ కో-ఆర్డినేటర్ రాకేష్ హాజరయ్యారు.నైపుణ్యాన్ని నేర్పించిన ధనాలకోట నాగేశ్వర్‌కి, స్పిక్ మాకే సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కాల్వ అడవుల్లో చిరుత అలజడి

● తలమడుగు మండలంలో మరో చిరుతపులి సంచారం ● భయాందోళన వ్యక్తం చేస్తున్న సమీప గ్రామాల ప్రజలు


లావర్‌పూర్ మండలం కాల్వ ఆర్చి వద్ద రాత్రి వేళ 61వ జాతీయ రహదారి దాటుతున్న చిరుతపులి

దిలావర్‌పూర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని 61వ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కాల్వ అడవుల్లో చిరుత సంచారం అలజడి రేపింది. కాల్వ అడవుల్లో చిరుత సంచరిస్తున్న వార్త మండలంలో దావణంలా వ్యాపించడంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. దిలావర్‌పూర్ పోలీసులు సోమవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా చిరుతపులి వారి కంట పడింది. వెంటనే వారు వీడియో తీశారు. సరిగ్గా రాత్రి ఒంటి గంట ప్రాంతంలో సిర్గాపూర్ వైపు పెట్రోలింగ్ చేసేందుకు వెళ్తున్న పోలీసులకు కాల్వ దేవస్థానం ఆర్చి వద్ద చిరుతపులి 61వ జాతీయ రహదారిని దాటుతూ పోలీసులకు కంట పడింది. సమీప గ్రామాల ప్రజలను, దేవస్థానానికి వెళ్లే భక్తులను అప్రమత్తం చేశారు. గతంలో కూడా ఈ ప్రాంతంలో చిరుతలు సంచరిస్తూ పశువులపై దాడి చేసి చంపాయి. అయితే గత కొద్ది రోజులుగా చిరుత సంచారం లేకపోవడంతో సమీప గ్రామాల ప్రజలు, లక్ష్మీ నరసింహస్వామి భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. తాజాగా మంగళవారం చిరుత కనిపించడం కలకలం రేపుతోంది. కాగా చిరుత సంచరిస్తున్న నేపథ్యంలో సమీప గ్రామాల రైతులు పంట పొలాలకు సూర్యోదయం తర్వాతనే వెళ్లాలని, నరసింహ స్వామి భక్తులు సైతం సూర్యోదయం తర్వాతనే జాగ్రత్తగా దేవాలయానికి వెళ్లాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

● నందిగామలో ఆవుపై దాడి

తలమడుగు: ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో చిరుతపులి సంచారంతో రైతులు, వ్యవసాయ కూలీలు గ్రామీణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని బరంపూర్ గ్రామానికి చెందిన ముడుపు కేదారేశ్వర రెడ్డి ఆవు మేత కోసం నందిగామ శివారు ప్రాంతంలోని అడవిలోకి వెళ్లగా మేతా మేస్తున్న సమయంలో ఒక్కసారిగా చిరుతపులి ఆవుపై దాడి చేయడంతో పశువుల కాపరి భయాందోళన చెంది గ్రామానికి వచ్చారు. చిరుత పులి. దాడి చేసిన ఆవు మృతి చెందింది. మృతి చెందిన విలువ దాదాపు 40 వేల వరకు ఉంటుందని రైతు కేదారేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ విషయమై అటు విషాద అధికారులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి ఎఫ్ఆర్ఓ పుండలిక్, ఎఫ్ఎస్ఓలు సయ్యద్ ఇమ్రాన్ రవీందర్, బీట్ ఆఫీసర్ హారిక విశ్వజీత్ ప్రశాంత్, శివ చరణ్, తదితరులు సంఘర్షలని పరిశీలించి. వివరాలు అడిగి తెలుసుకున్నారు కాగా ఇటీవల మండలంలోని డోర్లి శివారు ప్రాంతంలో పెద్దపుల్లి సంచరించినట్లు రైతులు తెలిపారు.


చిరుతపులి దాడిలో మృతి చెందిన ఆవును పరిశీలిస్తున్న అధికారులు

అదేవిధంగా కుచలాపూర్ శివారు ప్రాంతంలో చిరుత పులి సంచరించి పలువురు రైతులకు చెందిన పశువులను హతమార్చినట్లు గ్రామస్తులు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో. చిరుతపురులో పెద్ద పులులు. ఎలుగుబంట్లు సంచరించడంతో రైతులు వ్యవసాయ పనులకు వెళ్లేందుకు జంకుతున్నారు. కాదా పులుల భయంతో కొంతమంది రైతుల వ్యవసాయ భూముల్లో పత్తి ఎరడానికి కూడా కూలీలు రావడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అడవి శాఖ అధికారులు స్పందించి చిరుతపులు, పెద్దపులుల నుంచి రక్షణ కల్పించాలని మండలవాసులు కోరుతున్నారు.


రాంపూర్‌లో పిల్లలతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త

వసతి గృహ విద్యార్థులకు మెరుగైన విద్యనందించండి : పీవో

ఉట్నూర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని హస్నాపూర్ ఆశ్రమ పాఠశాల, రాంపూ(కె)లోని అంగన్వాడీ సెంటర్‌ను మంగళవారం పీవో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. గిరిజన సంక్షేమ పాఠశాలకు కాలినడకన వెళ్తూ మార్గమధ్యంలో పత్తి ఏరుతున్న రైతులతో ముచ్చటించి వ్యవసాయ సాగు గురించి అడిగితెలుసుకున్నారు. రాంపూర్ పాఠశాల మరియు అంగన్‌వాడీ సెంటర్‌లు మూసి ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల అటెండెన్స్ మరియు స్టాక్ రిజిస్టార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ డైట్ ప్రకారం పోషక విలువలు గల పచ్చి ఆకుకూరగాయల ఆహారాన్ని, అలాగే మొలకలడ్డు, గుడ్లు, పాలు రాగి మాల్ట్ అందించాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలనీ అన్నారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఇందులో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మహాసాయి పారాయణం

● నిర్మల్‌లో గత పదేళ్లుగా నిర్విరామంగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమం ● షిర్డీ నుంచి రానున్న సాయి పల్లకీ, పాదుకలు
● సాయి దీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో పూర్తయిన ఏర్పాట్లు

నిర్మల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాస్త్రినగర్‌లో గల అభయాంజనేయ స్వామి ఆలయం మహాసాయి పారాయణం వేడుకకు ముస్తాబైంది. ఈ నెల 2నుంచి 8వరకు ఆరు రోజుల పాటు జరిగే సాయి పారాయణం మహోత్సవానికి సాయి దీక్ష సేవా సమితి విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ప్రతీయేడు లోక కల్యాణార్థం సాయి దీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అదేవిధంగా గత పదేళ్లుగా నిర్విరామంగా కొనసాగుతున్న ఈ ఆధ్మాత్మిక కార్యక్రమానికి భక్తుల నుంచి విశేషంగా ఆదరణ లభిస్తోంది. సాయి పారాయణ పఠనం ద్వారా కోరిన కోరికలు నెరవేరుతాయని చెబుతుంటారు. దీంతో ప్రతీ సంవత్సరం పారాయణంలో పాల్గొనే భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. అంతేకాకుండా అదేవిధంగా ఈ కార్యక్రమానికి షిర్డి నుంచి ప్రత్యేకంగా వికాస్ మహరాజ్ ఆధ్వర్యంలో సాయి పల్లకీ, అలాగే బాబా పాదుకలను తెప్పిస్తున్నామంటున్నారు. ఈ సాయి పారాయణంలో భక్తులు, ముఖ్యంగా మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొంటారు.



నిర్మల్ పట్టణంలోని శాస్త్రినగర్‌లో సాయిబాబా పారాయణం నిర్వహించే స్థలం ఇదే..

సాయిబాబా ఆశీస్సులతోనే..
: లక్కడి జగన్మోహన్ రెడ్డి, సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షులు, నిర్మల్



నాతో పాటు మా కుటుంబ సభ్యులందరూ ఊహ తెలిసిన నాటి నుంచి సాయిబాబాను కొలిచే వాళ్ళం. బాబా ఆశీస్సులతోనే మేమంతా దిన దినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం నలుగురికి సహాయ సహకారాలు అందించే స్థాయికి ఎదిగాం. గత 20ఏళ్లుగా సాయి దీక్ష సేవా సమితిని ఏర్పాటు చేసి ఆధ్మాతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ, సేవా కార్యక్ర మాలను కొనసాగిస్తున్నాం. సాయికృప వల్లనే నిర్మల్‌లోని గండి రామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయాన్ని అద్భుత క్షేత్రంగా తీర్చిదిద్దే అవకాశం తనకు దక్కింది. అలాగే గత పదేళ్లుగా సాయి పారాయణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి, దాదాపు పది వేల వరకు పారాయణ గ్రంథాలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశాం. పారాయణ పఠనం ద్వారా భక్తులకు మానసిక ప్రశాంతతతో పాటు ఎందరో మందికి తమ కోరికలు నెరవేరాయి.

నిత్య పారాయణం చేస్తా..
: బి.రేఖసాయి, సాయి భక్తులు, నిర్మల్ పట్టణం



నాకు 9 ఏళ్ల వయసు ఉన్నప్పటి నుంచి నిత్య పారా యణం చేస్తున్నాం. ప్రతీరోజు ఒక అధ్యాయాన్ని చదవ డం చిన్ననాటి నుంచిఅలవాటైపోయింది. ఆ సాయి నాథుడి కృపతో మా ఇద్దరు పిల్లలకు మంచి ఉద్యోగాలు వచ్చాయి. బాబాను నమ్ముకోవడం వల్ల మనసు ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. నిర్మల్‌లోని గండి రామన్న క్షేత్రంలో గల సాయిబాబా ఆలయానికి ప్రతి గురువారం వెళ్లి సేవలో పాల్గొంటాను. ఇక్కడి ఆలయాన్ని సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఎంతో అభివృద్ధి చేశారు. ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య కూడా పెరిగింది. ప్రతీ సంవత్సరం వారం రోజులపాటు నిర్వహించే మహా సాయి పారాయణంలో పాల్గొనడం సాయి భక్తులు అదృష్టంగా భావిస్తారు.

రెగ్యులరైజ్ చేసే వరకు ఉద్యమం : సమగ్ర శిక్షా ఉద్యోగులు


ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని ఆ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం చర్చల సందర్భంగా ఆర్థిక అంశాలపై స్పష్టత ఇవ్వకుండా కమిటీలు వేస్తామని చెప్పడం విచారకరమన్నారు. కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న ఉద్యోగుల సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఉద్యోగులు కలెక్టర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం నాడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు. తాము కోరుతున్నది గొంతెమ్మ కోరికలు కావని.. 22 రోజులుగా శాంతియుత సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధకరమన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు ప్రియాంక, ప్రధాన కార్యదర్శి ధరం సింగ్, వెంకటి, పార్థసారథి, శ్రీకాంత్, కేశవ్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.


ఆదిలాబాద్‌లో రాస్తారోకో చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

పాఠశాలల్లో నూతన సంవత్సర వేడుకలు

బోథ్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులు నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. నాగభూషణం పాఠశాలలో విద్యార్థులు మంగళవారం మధ్యాహ్నం నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేకును కట్ చేసి వేడుకలను జరుపుకోవడం జరిగింది. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి వివిధ రకాల ఆటలు ఆడుతూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కిషోర్ కుమార్ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.


బోథ్‌లో కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



జిల్లా ప్రజలకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): 2025 సంవత్సరం ప్రతీ ఒక్కరికి శుభాలను చేకూర్చాలని, ప్రతీ కుటుంబం ఆనందంతో గడపాలని కలెక్టర్ రాజర్షిషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం శుభాకాంక్షలతు తెలిపేందుకు వచ్చే అధికారులు బొక్కేలు, పుష్పగుచ్చాలకు బదులు పేద విద్యార్థులకు ఉపయోగపడేలా నోట్‌పుస్తకాలు, పెన్నులు ఇతర సామాగ్రి ఇవ్వాలన్నారు. వాటిని త్వరలో విద్యార్థులకు పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

డెమ్మెలా ఆలయ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు


మాట్లాడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఉట్నూర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్య దైవం డెమ్మెలా రాజుల్క్ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని నర్సాపూర్(జె) గ్రామానికి ఎమ్మెల్యే సందర్శనకు రాగా.. ఆదివాసీ గిరిజనులు ఆదివాసీ వాయిద్యాలతో స్వాగతించారు. ఈ సందర్భంగా గ్రామంలోని డెమ్మెల్ ఆలయంలో పుష్యమాసాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనులకు పుష్యమాసం అతి పవిత్రమైనదని పేర్కొన్నారు. డెమ్మెల్ ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. ఆలయ ప్రాంగణంలో షెడ్డు, సోలార్ లైట్లను, తాగునీటి కోసం బోరు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామంలో రోడ్డు, డ్రైనేజీ సౌకర్యం కల్పించడానికి చర్యలు చేపడతామన్నారు. అటవీ శాఖ అధికారులతో మాట్లాడి వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇందులో నర్సాపూర్(జె) గ్రామ పటేల్ ఆత్రం కిషన్, ఆడగూడ గ్రామ పటేల్ ఆడ జంగు, మాజీ సర్పంచ్ కళావతి విశ్వనాథ్, ఎస్సీ సెల్‌జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, ఉట్నూర్‌లోని కొమురంభీం ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో మంగళవారం గోండ్వానా పంచాయతీ రాయి సెంటర్ల 38వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆదివాసీలకు సలహా సంఘాలు న్యాయ స్థానాలని, ప్రతీ సమస్యలకు పరిష్కారం అక్కడే లభిస్తుందన్నారు. ఇందులో జిల్లా మేడి మేస్రం దుర్గుపటేల్, రాజ్‌గోండు సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెందూరు ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

అహర్నిశలు పాటు పడిన వారికి తగిన ప్రతిఫలం : ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పోలీసు వ్యవస్థలో విధి నిర్వహణలో ఉత్తమప్రతిభ కనబరిచి, విధులలో అంకితభావం,క్రమశిక్షణతో అహార్నిశలు పోలీసు వ్యవస్థకు పాటు పడిన వారికి తగిన ప్రతిఫలం లభిస్తుందని ఎస్పీ గౌస్‌ఆలం అన్నారు. జిల్లాలో 18 మంది పోలీసు అధికారులు ఉత్తమ సేవ, సేవా పథకాలను పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పథకాలు అందుకోనున్న అధికారులకు మంగళవారం ఎస్పీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. దీనిలో భాగంగా ఉత్తమ సేవ పథకాలు పొందిన అధికారులలో సలాం దిలీప్, ఏఎస్సై ఉట్నూర్, సయ్యద్ అన్వర్ ఉల్‌హక్, డీఎస్‌బీఎస్‌ఐ, అలాగే, సేవా పథకం పొందిన అధికారులలో సీహెచ్.నాగేందర్, ఉట్నూర్ డీఎస్పీ, కేఆర్ సురేందర్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ, ఎస్.శేషరావు, రిజర్వ్ సబ్ ఇన్స్‌పెక్టర్ అటాచ్డ్ నిజామాబాద్, జి.గౌరయ్య, ఏఆర్ ఎస్సై, ఏఆర్ ఆదిలాబాద్, రాథోడ్ మారుతి, ఏఎస్సై నేరడిగొండ, జె.గుణవంత్, ఏఆర్ ఎస్సై ఏఆర్ ఆదిలాబాద్, పి.గోవింద రావు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఆదిలాబాద్, రాథోడ్ భరత్, హెడ్ కానిస్టేబుల్, డీటీసీ, బి.సంతోష్, హెడ్‌కానిస్టేబుల్, డీసీఆర్‌బి, జె.భారతి, ఉమెన్ హెడ్ కానిస్టేబుల్, డబ్ల్యుపీఎస్, బిగంగారెడ్డి, గుడిహత్నూర్ పోలీసు స్టేషన్, ఎం.దేవిదాస్, రూరల్ పోలీసు స్టేషన్, ఎస్.సీతారామరావు, ఏఆర్ కానిస్టేబుల్, ఎం.భూమన్న, ఏఆర్ కానిస్టేబుల్, ఎస్.స్వామి, జైనథ్ పోలీసు స్టేషన్, సీహెచ్.దేవిదాస్, డిస్ట్రక్ స్పెషల్ బ్రాంచ్,ఆ దిలాబాద్ ఉన్నారు.

మహిమాన్వితమైన యాగం

మావల, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఎంతో మహిమాన్వితమైన ఇంతటి గొప్ప యాగం ఆదిలాబాద్‌లో జరగడం ఇక్కడి ప్రజల అదృష్టమని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. లోక కల్యాణార్థం జిల్లా కేంద్రంలోనిలోని డైట్ మైదానం లో గత ఏడు రోజులుగా జరుగుతున్న శ్రీకృష్ణ కాలచక్రం అతిరుద్రం విశ్వశాంతి మహా యాగాన్ని ఆయన సందర్శించారు. యాగం నిర్వహిస్తున్న స్వామీజీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి గారినిని కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం యాగశాల, యజ్ఞశాల, గోశాల, కల్యాణ మండపాన్ని దర్శించుకుని పూజలు చేశారు. ఇంతటి విశిష్టమైన యాగంలో ప్రతీఒక్కరు పాల్గొని తరించాలని ఆయన కోరారు.


స్వామి ఆశీస్సులు తీసుకుంటున్న శ్రీకాంత్‌రెడ్డి

న్యూ ఇయర్ జోష్!

- జిల్లాలో అంబరాన్నంటిన కొత్త సంవత్సర సంబురాలు
- అర్ధరాత్రి తర్వాత కొనసాగిన వేడుకలు
- మార్కెట్‌లో కేక్‌లు, నాన్‌వెజ్ వంటకాల ఘుమఘుమలు
- రాత్రంతా మందుబాబుల హంగామా.. యువత కేరింతలు
- పోలీసుల నిరంతర పర్యవేక్షణ


జిల్లాకేంద్రంలో 2025 సంవత్సరానికి కేక్ కట్ చేసి స్వాగతం పలుకుతున్న విద్యానగర్ కాలనీవాసులు


ఆదిలాబాద్ పట్టణంలో కేక్‌లను కొనుగోలు చేస్తున్న యువకులు


జోరుగా సాగుతున్న నాన్‌వెజ్ వంటకాల అమ్మకాలు

ఆదిలాబాద్ అర్బన్/ ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): 2024కు వీడ్కోలు పలికి 2025కు వెల్‌కమ్ పలుకుతూ జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఎన్నో ఒడిదుడుకులతో సాగిన గత యేడాదికి వీడ్కోలు పలుకుతు నూతన సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా 31 పేరిట న్యూఇయర్ వేడుకలకు జరుపుకున్నారు. ఈ వేడుకలు అర్ధరాత్రి తర్వాత ఊపందుకున్నాయి. నూతన సంవత్సర వేడుకలను జరుపుకునేందుకు యువతీ యువకులు ఉదయం నుంచే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. స్నేహితులతో కలిసి ఆనందంగా గడిపేందుకు ప్రత్యేక ఏర్పాట్లను చేసుకున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి నూతన సంవత్సర వేడుకలు ప్రారంభమై అర్ధరాత్రి దాటే వరకు వేడుకల సందడి కనిపించింది. కేకులను కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఒకరికొకరు స్వీట్లను పంచిపెట్టుకుంటు ఆనందాన్ని వ్యక్తం చేశారు. అర్ధరాత్రి సరిగ్గా 12గంటలకు భారీగా టపాసులు, కేరింతలు కొడుతు నూతన సంవత్సరానికి ఘనస్వాగతం పలికారు. వేడుకల నేపథ్యంలో పోలీసులు గత రెండు, మూడు రోజులుగా అప్రమత్తంగా ఉండాలంటూ ప్రచారం చేస్తున్నారు. తాగిన మైకంలో వాహనాలు నడుప రాదంటూ హెచ్చరికలు చేశారు. డీజే సౌండ్ బాక్సులు, అధికంగా శబ్ధం చేసి సౌండ్ సిస్టంలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. నియమ నిబంధనలను అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవన్నారు. అర్ధరాత్రి 12.30గంటల తర్వాత ప్రజలు ఎవరు రోడ్లపై సంచరించవద్దన్నారు.

శుభాకాంక్షల వెల్లువ

అర్ధరాత్రి తర్వాత బ్యాండ్ మేళాలతో కేరింతలు కొడుతు 2025నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవడం కోసం స్నేహితులంతా ఒక్కదగ్గర కలిసి ఆనందంగా గడిపారు. అర్ధరాత్రి గడియారం ముళ్లు 12గంటల పైకి రాగానే ఒక్కసారిగా బాణాసంచ కాల్చి భారీ శబ్దాలతో హ్యాపీ న్యూఇయర్ అంటు సంతోషంగా శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులు,బంధువులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముఖ్యంగా సామాజిక మాధ్య మాలైన వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల ద్వారా శుభాకాంక్షల మెసేజ్‌లు హోరెత్తించాయి. కొందరైతే ఫోన్ కాల్ ద్వారా కూడా న్యూఇయర్ శుభాకాంక్షలు తెలుపుకుని ఆనంద క్షణాలను గడిపారు. దాదాపు గంట సేపు వరకు ఫోన్‌లన్నీ బిజీ బిజీగా మారిపోయాయి.


బోథ్ పట్టణంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న కేకులు

యువకుల సందడి

న్యూయర్ సందర్భంగా మార్కెట్ సందడి సందడిగా మారింది. కేకులు, స్వీట్లు, టపాసులు, నాన్‌వెజ్, మద్యం కొనుగోలుదారులతో అర్ధరాత్రి వరకు మార్కెట్‌లన్ని కిటకిటలాడాయి.నూతన సంవత్సర వేడుకలకు అనుగుణంగా వ్యాపారులు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. యువతను ఆకర్షించేందుకు వివిధ ఆకారాల్లో భారీ కేక్‌లను తయారు చేశారు. కొందరు వ్యాపారులైతే డీజేలు, రంగు రంగుల విద్యుత్ లైట్లను ఏర్పాటు చేసి స్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలో ప్రధాన కూడళ్లయిన ఎన్‌టీఆర్ చౌక్, కలెక్టర్ చౌక్, వినాయక్ చౌక్, నేతాజీ చౌక్, అంబేద్కర్ చౌక్, పంజాబ్ చౌక్‌లలో ప్రత్యేకంగా టెంట్‌లు వేసి కేక్‌లు, నాన్‌వెజ్ విక్రయాలు జరిపారు. సాయంత్రం నుంచే కేక్‌ల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. నాన్‌వెజ్ కోసం మందుప్రియులు భారీగా ఎగబడ్డారు. ముఖ్యంగా చికెన్ బిర్యాని, మటన్‌బిర్యాని, చికెన్ చిల్లి, చికెన్ 65, గ్రీన్ బకెట్ బిర్యాని, కుండ బిర్యాని, చికెన్ తందూరి, చికెన్ టిక్క, చికెన్ పకోడి, లివర్‌ఫ్రై, వివిధ రుచికరమైన వంటకాలను కొనుగోలు చేసేందుకు క్యూకట్టారు. ఈసారి డిసెంబరు 31 మంగళవారం రావడంతో కొందరు నాన్‌వెజ్, మద్యం ప్రియులు ఉదయం నుంచే వేడుకలను మొదలుపెట్టారు.

పరిమితులకు లోబడే..

న్యూఇయర్ వేడుకలను స్నేహితులు, కుటంబ సభ్యులతో ఆనందంగా గడుపుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. పరిమితులకులోబడే న్యూయర్ వేడుకలను జరుపుకోవాలని హెచ్చరిస్తున్నారు. మద్యం మత్తులో అతి చేయరాదంటూ సంతోషంగా న్యూఇయర్ వేడుకలను జరుపుకోవాలని, అర్ధరాత్రి దాటిన తర్వాత మద్యం మత్తులో బైక్‌లు నడుపడం, ట్రిబుల్ రైడింగ్ చేస్తూ ఇతరులకు ఇబ్బందులు కలిగించే విదంగా భారీ శబ్దాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవంటున్నారు. నూతన సంవత్సర వేడుకలలో నిషేదిత డ్రగ్స్, గంజాయి లాంటి మాదక ద్రవ్యాలను విక్రయించిన, వినియోగించినచట్టపరమైనచర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లు వాహనం నడుపుతు పట్టుబడితే వారికి వాహనాలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామని, వారి వల్ల ఏదైనా ప్రమాదం సంభవించినట్లయితే సంరక్షకుల ప ఐన కేసులు నమోదవుతాయని పోలీసులు తెలిపారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన,ఇబ్బంది పెట్టిన వారిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో అతి చేస్తూ మద్యం తాగిన వారిపై చర్యలు ఉంటాయని పోలీసులు సూచిస్తున్నారు. మద్యం దుకాణాలు నిర్ణీత సమయాలలో మూసివేసి, మైనర్లకు మద్యం అమ్మకూడదని తెలిపారు. ఇంట్లోనే ప్రశాంతంగా వేడుకలను నిర్వహించుకోవాలని సూచిస్తున్నారు.

బోథ్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బోథ్ మండల కేంద్రంలో వివిధ షాపుల వారు కేకులను విక్రయించారు. మంగళవారం సంత కావడంతో వివిధ గ్రామాల నుంచి వచ్చిన యువకులు కేకులను తీసుకువెళ్లారు.

గతేడాది హత్యలు తగ్గినా.. పెరిగిన అత్యాచారాలు

- జిల్లా వార్షిక నేర నివేదికను వెల్లడించిన ఎస్పీ గౌస్‌ఆలం

ఆదిలాబాద్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): గడిచిన యేడాదిలో హత్యలు తగ్గినా.. అత్యాచారాలు మాత్రం భారీగా పెరిగాయి. 13 హత్యలు, 45 అత్యాచార కేసులు నమోదైనట్లు మంగళవారం వార్షిక నేర నివేదికలో జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం వెల్లడించారు. 2023లో మొత్తం 3,275 వివిధ కేసులు నమోదు కాగా, 2024లో 3034 కేసులు నమోదయ్యాయి. గతేడుతో పోల్చుకుంటే ఈ యేడు కేసుల సంఖ్య కొంతమేరకు తగ్గుముఖం పట్టినట్లు కనిపిస్తుంది. అలాగే కోర్టులో 1714 కేసులలో 729 కేసులు నేర నిరూపణ రుజువైంది. జిల్లా సరిహద్దుపై సరైన నిఘా సారించక పోవడంతో దొంగతనాలు, దోపిడిలు, అక్రమ రవాణా కేసులకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. 44వ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న నేరడిగొండ, ఇచ్చోడ, గుడిహత్నూర్, మావల, ఆదిలాబాద్‌రూరల్, జైనథ్ మండలాల పోలీసు స్టేషన్ల పరిధిలోనే ఎక్కువగా కేసులు నమోదవుతున్నట్లు తెలుస్తుంది. సైబర్ నేరగాళ్ల భారీన పడి ఆర్థికంగా నష్టపోయిన బాధితులకు డబ్బులు తిరిగి అందించడంలో సైబర్ క్రైం విభాగం కీలకంగా వ్యవహరించింది. జిల్లా పోలీసుల ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యేందుకు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. మాదక ద్రవ్యాలు, గంజాయిలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసులు వివిధ రకాల ప్రయత్నాలు చేశారు. అసాంఘీక కార్యకలాపాలకు పూర్తిగా అడ్డుకట్ట వేయడంలో జిల్లా పోలీసులు సఫలీకృతమైనట్లు నివేదికలు చెబుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు జరిగిన పోలీసుల అప్రమత్తతతో మరణాల సంఖ్య తగ్గుముఖం పట్టినట్లు నివేదికలో వెల్లడయ్యింది.

అదుపు లేని ఆర్థిక నేరాలు

సాంకేతిక పరిజ్ఞానం పెరిగి పోవడంతో ఆర్థిక నేరాలకు అడ్డు అదుపే లేకుండా పోతుంది. గతేడుతో పోల్చుకుంటే ఈ యేడు ఆర్థిక నేరాలు భారీగా పెరిగాయి. 2023లో 266 ఆర్థిక నేరాల కేసులు నమోదు కాగా ఈ యేడు 344 కేసులు నమోదైనట్లు వార్షిక నేర నివేదిక ద్వారా తెలుస్తుంది. అలాగే

జిల్లాలో కొన్ని ముఖ్యమైన కేసుల వివరాలు ఇలా..

నేరం	2023	2024
హత్య కేసులు	18	13
శిక్షపడిన కేసులు	908	729
రోడ్డు యాక్సిడెంట్	287	346
డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు	6753	5583
గంజాయి కేసులు	29	77
పేకాట కేసులు	90	98
ఆర్థిక నేరాలు	266	344
వరకట్న మరణాలు	01	04
అత్యాచార కేసులు	38	45
చీటింగ్ కేసులు	130	190

వరకట్న మరణాల సంఖ్య పెరుగుతునే ఉంది. గృహహింసలను భరించలేక వరకట్న వేదింపులను తట్టుకోలేక నలుగురు మహిళలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. బాధితుల అత్యాశను, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్న సైబర్ నేరగాళ్ల ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు. జిల్లాలో 108 ఫిర్యాదులు రాగా కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా 32లక్షల 28వేల 674 రూపాయలను రికవరి చేసి బాధితులకు అందజేశారు. అలాగే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా బాధితులు పోగొట్టుకున్న 546 మొబైల్ ఫోన్లను తిరిగి అందజేశారు. ఈ యేడు 100 డయల్‌కు మొత్తం 17వేల 86 ఫోన్‌కాల్స్ రాగా వాటన్నింటిని సుమారుగా 7 నిమిషాలలోనే సంఘటన స్థలాలకు చేరుకుని తగు పరిష్కారాన్ని చూపారు. అలాగే రెండు క్రికెట్ బెట్టింగ్ కేసులు, 7 ఇసుక మాఫియా కేసులు, 5 వ్యభిచారం కేసులు నమోదయ్యాయి.

ఆయుధాల అక్రమ రవాణా గుట్టురట్టు

ఉత్తరాది రాష్ట్రాల నుంచి జిల్లా మీదుగా అక్రమ ఆయుధాల రవాణాను జిల్లా పోలీసులు గుట్టురట్టు చేశారు. ఈ యేడు రెండు ఆర్మ్స్ యాక్ట్ కేసులను నమోదు చేసి 13 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి 4 (7.65 ఎంఎం పిస్టల్‌లను) 8 మ్యాగజైన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నవంబర్ 22న పక్కా సమాచారంతో ఆదిలాబాద్ జిల్లా చాందా(టి) బైపాస్ రోడ్డు వద్ద ఆదిలాబాద్‌రూరల్ పోలీసులు అక్రమ ఆయుధాలను తరలిస్తున్న నిందితులను అరెస్టు చేయడం రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. జనశక్తి పార్టీలో పని చేసిన ఏ-1 నిందితుడు ఓట్టివెంకటరెడ్డి సూర్యపేట జిల్లాలో తన మిత్రుడు హత్యకేసుకు ప్రతికారం తీర్చుకునేందుకు, అలాగే ఉమ్మడి కర్నూల్ జిల్లాలో జనశక్తి పార్టీని తిరిగి పునర్నించేందుకు మారణాయుధాలను కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. బిహార్ రాష్ట్రం మ్యుంగార్ రైల్వేస్టేషన్‌కు వెళ్లి పిస్టల్స్, బుల్లెట్లను కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా జిల్లాలో నిర్వహించిన తనిఖీల్లో ముఠా ఆగడాలను పోలీసులు గుట్టురట్టు చేశారు.

పెరిగిన రోడ్డు ప్రమాదాలు

జిల్లాలో గడిచిన యేడాదిలో రోడ్డు ప్రమాదాల సంఖ్య భారీగా పెరిగింది. ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవడం, రోడ్డు భద్రత చర్యలు చేపట్టక పోవడంతో ప్రమాదాల సంఖ్య పెరిగినట్లు తెలుస్తుంది. 2023లో 287 రోడ్డు ప్రమాదాలు జరుగగా 127 మంది మరణించారు. మరో 133 మంది గాయపడ్డారు. ఈ యేడు 346 రోడ్డు ప్రమాదాలు జరుగగా 133 మంది ప్రయాణికులు మరణించారు. మరో 195 మంది స్వల్పంగా, తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తుంది. ముఖ్యంగా జిల్లా మీదుగా వెళ్తున్న 44వ జాతీయ రహదారి పైననే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, మద్యం మత్తులోనే ప్రమాదాలు జరుగుతున్నాయని వార్షిక నివేదికల ద్వారా తెలుస్తుంది. ప్రమాదాలను అరికట్టేందుకు పలు రకాల చర్యలు తీసుకుంటున్న వాహనదారుల్లో ట్రాఫిక్ నిబంధనల పై సరైన అవగాహన కనిపించడం లేదు. వాహనాల అతివేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్‌గన్ ద్వారా 2492 కేసులను నమోదు చేశారు.

తగ్గిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

గతేడుతో పోల్చుకుంటే ఈ యేడు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు కొంత వరకు తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తుంది. 2023లో 6753 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు కాగా ఈ యేడు కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టి 5583 కేసులు నమోదయ్యాయి. అలాగే దొంగతనాలు భారీగా పెరిగాయి. చీటింగ్ కేసుల సంఖ్య భారీగా పెరిగింది. యేడాదిలో 190 చీటింగ్ కేసులు నమోదయ్యాయి. పీడీఎస్ బియ్యాన్ని సరిహద్దులు దాటిస్తుండగా పోలీసులు నిఘా సారించి 25 కేసులను నమోదు చేశారు. మట్కా, గుట్కా కేసులు 30 నమోదయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను విచ్చలవిడిగా నమోదు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కొంత వరకు తగ్గుముఖం పట్టినట్లు కనిపిస్తుంది. ప్రభుత్వ ఆదేశాలతోనే పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల జోలికి వెళ్లడం లేదని తెలుస్తుంది.

పెరిగిన టాస్క్‌ఫోర్స్ నిఘా

టాస్క్‌ఫోర్స్ నిఘాతో జిల్లాలో పలు కీలకమైన కేసులు నమోదయ్యాయి. ఇందులో ముఖ్యంగా రైతులకు నకిలీ విత్తనాలను అంటగడుతున్న ముఠా పై కేసులు నమోదు చేసి 12మందిని అరెస్టు చేశారు. ఇందులో రూ.10లక్షల 39వేల 285 విలువ గల విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 77 గాంజా కేసులను నమోదు చేసి 152 మంది వ్యాపారులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 1044 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.2కోట్ల 24లక్షల 64వేల 550 ఉంటుందని అంచనా వేస్తున్నారు. రాయితి బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా 25కేసులను నమోదు చేసి 45 మందిని అరెసక్టు చేశారు. వీరి నుంచి 1591 క్వింటాళ్ల రాయితి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే 98 పేకాట కేసులను నమోదు చేసి 572 మంది జూదరులను అరెస్టు చేశారు. 78 గుట్కా కేసులను నమోదు చేసి 122 మందిని అదుపులోకి తీసుకున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట

: గౌస్‌ఆలం, జిల్లా ఎస్పీ, ఆదిలాబాద్



గడిచిన యేడాదిలో అసాంఘీక కార్యకలాపాలకు పూర్తిగా అడ్డుకట్ట వేయగలిగాం. అలాగే మాదక ద్రవ్యాలు, గంజాయి లాంటి మత్తు పదార్థాలను అరికట్టాం. హత్యలు, నేరాల కేసులను తగ్గుముఖం పట్టించాం. సైబర్ క్రైమ్ ద్వారా సత్వర సేవలను అందించి బాధితులకు న్యాయం చేశాం. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పటికి ప్రమాదాలలో మరణాల సంఖ్యను తగ్గించేందుకు పోలీసు శాఖ కీలకంగా వ్యవహరించి ఎందరో మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడగలిగింది. పోలీసు శాఖ తరపున మెడికల్ క్యాంపులను నిర్వహించి క్రీడలను ప్రోత్సహించాం. ముఖ్యంగా ఆదివాసీ గ్రామాల పై ప్రత్యేకదృష్టి సారించి సేవా కార్యక్రమాలను చేపట్టాం.


ఉద్యోగ విరమణ పొందిన కిషన్ రూపావత్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ ఉద్యోగులకు
ఉద్యోగ విరమణ సహజమే..

నేరడిగొండ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమేనని కుంటాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు గుగ్లొత్ అంబారావు అన్నారు. చించోలి గ్రామంలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న రూపావత్ కిషన్, గుత్పల్ల గ్రామంలో ఉపాధ్యాయుడగా విధులు నిర్వహిస్తున్న ఆర్.గణపత్ రావు మంగళవారం ఉద్యోగ విరమణ చేపట్టారు. ఈ సందర్భంగా మంగళవారం కుంటాల కాంప్లెక్స్ పాఠశాలలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారిద్దని శాలువాతో సత్కరించి పుష్పగుచ్చాలను అందజేశారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ రూపావత్ కిషన్, ఆర్.గనపత్ ఉపాధ్యాయులుగా ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. ఎందరో విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్ది వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారని అన్నారు. వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.